క్లుప్తంగా

మెజార్టీ స్థానాలు గెలుస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పోలింగ్ సరళిని చూస్తే కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో 12కు పైగా స్థానాలు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు పూర్తి విశ్వాసం చూపించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై చిత్తశుద్ధిగా ఉన్నామన్నారు. ఆగస్టు 15లోగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను రైతులు విశ్వసించి లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి అండగా నిలిచారని చెప్పారు. నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని చెప్పారు. అలాగే కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

మహేశ్వరం నియోజకవర్గంలో 52.70శాతం పోలింగ్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంలో 52.70 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 537 పోలింగ్ స్టేషన్లు, మొత్తం ఓటర్లు 5,56,741 ఉండ గా అందులో 2,93,387 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. మహేశ్వ రం మండలంలో 67,983 మంది ఓటర్లకు 48,888 పోలై 71.91శాతం నమోదైంది. కందుకూరు మండలంలో 50,437 మంది ఓటర్లకు 40,067 ఓట్లు పోలై 79.44శాతం, సరూర్‌నగర్ మండలం 1,26,649 మంది ఓట్లకు 53,506 ఓట్లు పోలై 42.25శాతం నమోదైంది. బాలాపూర్ మండలం 3,11,672 ఓట్లకు 1,50,926 ఓట్లు పోలై 48.42శాతం ఓటింగ్ నమోదైంది. నియోజకవర్గంలోని అత్యధికంగా కందుకూరు మండలం 79.44శాతం నమోదు కాగా, అత్యల్పంగా సరూర్‌నగర్ మండలంలో 42.25శాతం పోలింగ్ నమోదైంది.

టీఎంఆర్‌జేసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్సూరాబాద్: డివిజన్ పరిధి సూర్యోదయనగర్ కాలనీలోని టీఎంఆర్‌జేసీ (బాలికల) బాలానగర్‌లో వచ్చే విద్యాసంవత్సరానికి (2024–25) సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ వినీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం మైనార్టీలకు–51, క్రిస్టియన్లకు–5, జైన్, పార్సీ, బౌద్ధులు, సిక్కులకు–4 సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు నం. 9160255040లో సంప్రదించాలని కోరారు.

18 నుంచి హనుమాన్ చాలీసా పారాయణం

వనస్థలిపురం: ఎన్జీఓస్ కాలనీలోని గణేష్ ఆలయంలో ఈ నెల 18 నుంచి జూన్ 1న హనుమజ్జయంతి వరకు.. ప్రతినిత్యం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కె. ధర్మారావు గుప్తా, ప్రధాన కార్యదర్శి పీవీకే సోమయాజులు తెలిపారు. అలాగే ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నం. 93901 97132 ను సంప్రదించాలన్నారు.

వైభవంగా అష్టలక్ష్మి ఆలయ బ్రహ్మోత్సవాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవీ కాలనీలోని అష్టలక్ష్మి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ప్రాభోదిక, శ్రీ సుదర్శనేష్టి, ద్వారతోరణ, బలిప్రదానం, మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, చక్రతీర్థం, కల్పవృక్షవాహన సేవ, రథోత్సవం నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్సీ బొగ్గారపు దయనంద్ గుప్తా, ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ చంద్రశేఖర్ గుప్తా, కమిటీ సభ్యులు జగన్, ఐతే అంజయ్య గుప్తా, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌ను కలిసిన జర్నలిస్టులు

సైదాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు నగరానికి వచ్చిన త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డిని మలక్‌పేట నియోజకవర్గ సీనియర్ జర్నలిస్టులు కలుసుకున్నారు. మంగళవారం ఉదయం సలీంనగర్ కాలనీలోని నివాసంలో త్రిపుర గవర్నర్ జర్నలిస్టులతో భేటీ అయ్యారు. మలక్‌పేట నియోజకవర్గంతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్న ఆయన జర్నలిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్రిపురకు సంబంధించిన రాజకీయ, సాంస్కృతిక, పర్యాటక, చరిత్ర వంటి పలు అంశాలను జర్నలిస్టులు ఆయనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జర్నలిస్టులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టులు ఉన్నారు.

శిలాఫలకానికే పరిమితం

- జీటీకి నోచుకోని కొత్తపల్లి–నాగిళ్ల రోడ్డు
- రెండేళ్ల క్రితం పనులు ప్రారంభం
- మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు





యాచారం–మాడ్గుల్ సరిహద్దు రోడ్డు (ఇన్‌సెట్‌లో 2023 ఆగస్టులో వేసిన శిలాఫలకం)

యాచారం: రెండు మండలాలకు ప్రధానమైన సరిహద్దు రోడ్డును బీటీగా మార్చేందుకు రెండేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శిలాఫలకం వేసింది. దీంతో రోడ్డు అందుబాటులోకి వస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యింది ఆ రోడ్డు నిర్మాణం . వివరాల్లోకి వెళ్తే.. యాచారం–మాడ్గుల్ మండలాల సరిహద్దుగా ఉన్న కొత్తపల్లి–నాగిళ్ల రోడ్డును బీటీగా మార్చడం కోసం 2023 ఆగస్టు 24న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం శిలఫలాకం వేసింది. దాదాపు 6 కిలోమీటర్ల రోడ్డును బీటీగా మార్చడం కోసం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఎస్టీ ఎస్‌డీఎఫ్(గిరిజన సంక్షేమశాఖ) నుంచి రూ.మూడు కోట్ల 20 లక్షల నిధులను మంజూరు చేయించారు. నిధులు మంజూరైన వెంటనే అప్పట్లో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన కూడా చేశారు. సంబంధిత అధికారులకు త్వరగా పనులు పూర్తి చేయాలని కూడా ఆదేశించారు. అయితే తదనంతరం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడంతో రోడ్డు పనులు ముందుకు సాగలేదు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.10 లక్షల వరకు ఖర్చు చేసిన కాంట్రాక్టర్.. ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌లో నిధులు వస్తాయో.. రావోననే భయంతో పనులను నిలిపేశాడనే విమర్శలు ఉన్నాయి.

రాత్రయితే ప్రయాణం బంద్..

కొత్తపల్లి–నాగిళ్ల గ్రామాల మధ్యన సరిహద్దు రోడ్డుపై రాత్రి అయ్యిందంటే ప్రయాణికులు రాకపోకలు బంద్ చేస్తారు. యాచారం మండల కేంద్రం నుంచి కొత్తపల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు ఉండటం, అదే విధంగా మాడ్గుల్ మండలం నుంచి నాగిళ్లతండా వరకు బీటీ రోడ్డు ఉంది. కానీ రెండు మండలాల సరిహద్దులోని ఆరు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా మట్టితో బైక్‌పై సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. ఈ సరిహద్దు రోడ్డు మధ్యలో కొత్తపల్లి గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో కొత్తపల్లి తండా ఉంటుంది. ఈ తండాలో 30 ఇళ్లు ఉండగా 100 వరకు జనాభా ఉంటుంది. రోడ్డు బాగాలేకపోవడంతో రాత్రి సమయంలో గిరిజనులు అత్యవసర పరిస్థితులున్నా బయటకు రారు. కొత్తపల్లి తండా గుట్టల మధ్య, అటవీ ప్రాంతంలో ఉంది. ఏ ఇబ్బందులు వచ్చినా... ప్రాణాలు పోయే పరిస్థితి దాపురించినా ఈ తండా గిరిజనులు రాత్రిపూట అలానే ఓర్చుకుని తెల్లవారుజామునే ఆస్పత్రులకు వెళ్తారు. రోడ్డు బాగలేకపోవడంతో గతంలో పలువురు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. తండావాసులు రేషన్ సరుకుల కోసం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తపల్లికి వచ్చి తీసుకెళ్తారు.

బీటీ రోడ్డుగా మారితే..

ఈ రోడ్డు బీటీ రోడ్డుగా మారితే యాచారం–మాడ్గుల్ మండలాల ప్రజలకు ప్రయాణం సులభతరమవుతుంది. మాడ్గుల్ మండలంలోని నాగిళ్ల, కొలుకులపల్లి, నాగిళ్లతండా తదితర గ్రామాల ప్రజలు సాగర్‌రోడ్డు మాల్ మీదుగా ప్రయాణం చేయకుండా కొత్తపల్లి గ్రామం మీదుగా తక్కువ సమయంలో యాచారంతో పాటు హైదరాబాద్ చేరుకుంటారు. మాడ్గుల్ మండలంలోని పలు గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది కార్మికులు, వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు నిత్యం హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తారు. ప్రతి మంగళవారం మాల్‌లో పశువుల సంత జరుగుతుంది. రోడ్డు మార్గం లేక ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే సకాలంలో, తక్కువ చార్జీలతో గమ్యాస్థానాలకు చేరుకుంటారు. రోడ్డు నిర్మాణం పూర్తి అయితే కొత్తపల్లితండా నుంచి కొత్తపల్లి గ్రామం మీదుగా కిషన్‌పల్లి నుంచి మాల్ మార్కెట్‌కు తక్కువ సమయంలో చేరుకోవచ్చు.

రాత్రి అయితే ప్రయాణం బంద్



మాది కొత్తపల్లి తండా. కొత్తపల్లి గ్రామానికి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతం, గుట్టల మధ్యన మా తండా ఉంది. రోడ్డు బాగా లేకపోవడంతో భయానికి ప్రయాణం బంద్ చేసుకుంటాం. మా తండా మీదుగా నిత్యం ఉదయం, రాత్రి మాత్రమే బస్సు రాకపోకలు సాగిస్తుంది. బస్సు సర్వీసులు తక్కువగా ఉండటం, రోడ్డు బాగాలేకపోవడంతో ఉదయం తండా నుంచి వెళ్తే రాత్రే ఇంటికి వస్తాం. రోడ్డును వెంటనే బాగు చేయించి బస్సుల ట్రిప్పులను పెంచాలి.

– కస్నానాయక్, కొత్తపల్లి తండా

మొదట్లో హడావుడి చేశారు



కొత్తపల్లి–కొత్తపల్లి తండా రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామంటూ శిలాఫలకం వేసిన మొదట్లో అధికారులు తెగ హడావుడి చేశారు. రోడ్డు వెడల్పు పనులు చేసి, మట్టిని పోశారు. దీంతో త్వరగా రోడ్డు నిర్మాణం కూడా పూర్తి అవుతుందని అనుకున్నాం. అయితే అసెంబ్లీ ఎన్నికలు రాగానే రోడ్డు నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. కొత్తపల్లి నుంచి కిషన్‌పల్లి మీదుగా మాల్ వరకు రోడ్డు నిర్మాణం కూడా వేయాలి.

– జగన్, మాజీ ఉపసర్పంచ్, కొత్తపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా

వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో రోడ్డు పనులు ఆలస్యమయ్యాయి. కొత్తపల్లి–కొత్తపల్లితండా, కొత్తపల్లి–కిషన్‌పల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణం కోసం దాదాపు రూ.6 కోట్ల పైగానే నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో రోడ్డు విస్తరణ పనులు కూడా ప్రారంభించాం. పనులు నిలిచిపోవడంతో స్థానికులకు ఇబ్బంది కలుగుతున్నమాట వాస్తవమే. ఎన్నికల వల్లనే ఇన్నిరోజులు ఆలస్యం అయ్యింది. పనులు నిలిచిపోయినట్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

– ఉస్మాన్, ఏఈ పంచాయతీరాజ్ శాఖ



చుక్కా చెరువు.. చుక్క నీరు కరువు

తలకొండపల్లి: వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో మండల పరిధి ఎడవెల్లిలోని చుక్కాచెరువు పూర్తిగా ఎండిపోయింది. అక్కడక్కడ గుంతల్లో కొద్దిగా నీరు నిలిచింది. చెరువు విస్తీర్ణం 60 ఎకరాలు. ఈ చెరువు నిండి అలుగు పారితే పరిసర ప్రాంతాల్లోని దాదాపు 150 బోర్లల్లో నీటిమట్టం పెరుగుతుంది. చెరువు పరిసర ప్రాంతాల్లో సంవత్సరానికి రెండు పంటలు పండించుకోవచ్చు. ఈ సారి చెరువు ఎండిపోవడంతో బోర్లలో నీటిమట్టం తగ్గి వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే నీరులేక చుట్టుపక్కల రైతులు పంటలు వేయలేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటు సాగునీటితో పాటు, ఇటు తాగునీరు కొరత ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జీరో బిల్లుల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ

యాచారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 5 నెలలు కావస్తున్నా పేదల ఇళ్లకు ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పేర్కొన్నారు. యాచారంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ... పేదలు ఎప్పుడు ఉచిత విద్యుత్ అందజేస్తారని ఎదురుచూస్తున్నారని, విద్యుత్ సిబ్బంది ప్రతీనెల ఆలస్యంగా బిల్లులు కొట్టడం వల్ల అదనంగా బిల్లు వస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పేదలకు జీరో బిల్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల కేంద్రంలోని 4వ వార్డులో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి ఆండాలు అనే మహిళ మృతి చెందింది. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన తిరుపతి యాదమ్మ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. బాధిత కుటుంబాలను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ పరామర్శించి ఆయా కుటుంబాలకు ట్రస్ట్ తరపున ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున సాయం అందించారు. అదే విధంగా బాధిత కుటుంబాలకు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా రూ.10 వేలు, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు భాస్కర్ రెడ్డి, రాఘవేందర్, చెన్నకేశవులు, శ్రీరాములు, దేవేందర్, యాదయ్య, చంద్రశేఖర్, నాగార్జున, రవి, రాంచందర్ తదితరులు ఉన్నారు.

పోటెత్తిన భక్తులు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు క్యూలైన్లో ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, బోనం నైవేద్యం సమర్పించుకున్నారు. సామూహిక సత్యానారాయణ స్వామి వ్రతాలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం తదితరులు పాల్గొన్నారు.

వృథా నీటిని స్కూల్‌లోకి రానీయొద్దు



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కమ్మదనం గురుకుల పాఠశాలలోకి మిషన్ భగీరథ వృథా నీటిని రానీయకుండా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులో ఉన్న బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత పాఠశాలలోకి వస్తున్న మిషన్ భగీరథ వృథా నీటి విషయంపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గురుకుల పాఠశాల, మిషన్ భగీరథ ప్లాంట్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నీటిని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వృథా నీరు గురుకుల పాఠశాలలోకి వెళ్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి పాఠశాలలోని నీరు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వృథా నీటిని వన్యప్రాణులకు ఉపయోగపడే విధంగా పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు వృథా నీటిని దారి మళ్లించేలా వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్ రావు, డీఈ సందీప్, ఏఈ రూప, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాబర్‌ఖాన్, ఎంపీటీసీ అరుణ, అంజయ్యగౌడ్, దేవగిరి నవీన్, అశోక్, చందు, రాజు, రాఘవేందర్, శ్రీశైలం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో పోలింగ్ ప్రశాంతం

- మొత్తం ఓటర్ల సంఖ్య 40,029
- ఓటేసిన 29,399 మంది
- 73 శాతం పోలింగ్ నమోదు
- బీఆర్ఎస్‌లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ప్రచారం

మంచాల: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. నిన్నటి వరకు ఓటర్లను పోటీపడి కలిసిన నాయకులు.. పోలింగ్ అనంతరం సమాలోచనలో పడ్డారు. అయితే గ్రామాల్లో ఓటింగ్ సరళి అంతుచిక్కకుండా ఉంది. మంచాల మండలంలోని 44బూత్‌లలో 40,029 ఓటర్లు ఉండగా అందులో 29,399 ఓట్లు పోలయ్యాయి. దాదాపు 73శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న నాయకులు, వారి అనుచరులు స్థానికంగా ఉండే ఓటర్లతో పాటు నగరంలో, ఇతర ప్రాంతాల్లో ఉండే ప్రతి ఓటరును కలిసారు. అవసరమైతే చేతి ఖర్చులకు డబ్బులు ఇచ్చి ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం కేవలం గ్రామాల్లో ఉండే ఓటర్లను మాత్రమే కలిసి ఓటు వేయాలని కోరుతున్నారు. నగరంలో, ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను పెద్దగా పట్టించుకోకపోయిన వారే స్వచ్ఛందంగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. వారు ఎవరికి ఓటు వేశారనేది అంతు చిక్కడం లేదు. దీంతో ఈ ఓటింగ్ ఎవరికి లాభం చేస్తుందనే భయం నెలకొంది. యువత చాలావరకు బీజేపీ వైపు, వృద్ధులు కాంగ్రెస్ వైపు, రైతులు మాత్రం బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో క్రాస్ ఓటింగ్ జరిగిన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ క్రాస్ ఓటింగ్ ఎవరికి మేలు చేస్తుందనేది ఎన్నికల ఫలితాలు వస్తే తప్ప చెప్పలేని పరిస్థితి. దీంతో నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు....!

లోక్‌సభ పోలింగ్ రోజున మండలంలో ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గతంలో ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక గ్రామంలో, ఏకంగా పోలింగ్ బూత్‌లలో సైతం గొడవలు జరిగేవి. అందుకు భిన్నంగా ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 23 గ్రామ పంచాయతీలు, పోలింగ్ బూత్‌లలో ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



ఆరుట్లలో ఓటు వేసిన యువత

ఓటరు ఎటువైపు?



- అభ్యర్థులకు అంతుచిక్కని ఓటరు నాడి
- తామే గెలుస్తామంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్న వైనం
- కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ భయం

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల సమరం సోమవారం ముగియడంతో ఓటింగ్ సరళిని బట్టి తమకు ఎన్నిఓట్లు వస్తాయో అనే ఆలోచనలో ఆయా పార్టీల శ్రేణులు తలమునకలనారు. నగరానికి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం భువనగిరి లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్, కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేశ్ ఇక్కడ బరిలో నిలిచిన వారిలో ప్రధానంగా ఉన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 3,39,341 మంది ఓటర్లు ఉండగా అందులో 2,26,790 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీల మధ్యనే హోరాహోరీగా పోరు సాగినట్లు రాజకీయ పరిశీలకులంటున్నారు. ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 1,26,506 ఓట్లు, బీఆర్ఎస్‌కు 89,806 ఓట్లు, బీజేపీకి కేవలం 15,790 ఓట్లు మాత్రమే ఈ నియోజకవర్గంలో సాధించాయి. గత అసెంబ్లీ ఎన్నికల కంటే సుమారు 18వేల పై చిలుకు ఓట్లు ఈ లోక్‌సభ ఎన్నికల్లో తక్కువగా పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల వరకు నియోజకవర్గంలో పెద్దగా పట్టులేని బీజేపీ.. లోక్‌సభ ఎన్నికల నాటికి బలం పుజుకున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఆ పార్టీకి క్రాస్ ఓటింగ్ భయం..

అయితే రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీకి క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. బీఆర్ఎస్ ఓట్లు పెద్ద సంఖ్యలో బీజేపీకి టర్న్ అయ్యాయని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు చేతులెత్తేసి బీజేపీకి ఓట్లు వేయించారని మీడియాతో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పడమే ఈ చర్చకు మరింత బలం చేకూరుస్తోంది. అంతేగాక అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే తక్కువ ఓట్లు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు పోలయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. ఈ భయం కూడా కాంగ్రెస్ శ్రేణులను వెంటాడుతుంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

భువనగిరి లోక్‌సభ స్థానానికి సంబంధించి నియోజకవర్గంలో మంచి మెజార్టీ సాధిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఓ పక్కన ధీమాగా ఉన్నారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ కూడా విజయం తననే వరిస్తుందనే ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ దింపుడుకళ్లెం ఆశలతో ఉన్నట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ రాష్ట్రంలో, బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్‌కు ఈ ప్రాంతంపై పట్టు ఉండటంతో ఓటర్లు ఎవరికి ఓటు వేసారో తెలియక అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఓటర్ల నాడి ఏంటి అనేది రాజకీయ పండితులు, నేతలకు సైతం అంతు చిక్కని పరిస్థితి నెలకొని ఉంది. ఈ సస్పెన్స్‌కు తెరపడాలంటే ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీ వరకు వేచిఉండాల్సిందే.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2002-03 నాగిళ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

మాడ్గుల: మండల కేంద్రంలోని నాగిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. 2002–03 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వారంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు శ్రీను, యాదగిరి, జగన్, శ్రీశైలం, అశోక్, తిరుపతి, శారద, పద్మ, గీత, నిర్మల, అవంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలి

పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



వనస్థలిపురంలో పార్టీ నాయకులతో సమావేశమైన మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పార్టీ డివిజన్ అధ్యక్షులు, పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని డివిజన్ల ఇన్‌చార్జీలు, డివిజన్ల అధ్యక్షులతో మంగళవారం వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రారంభమైనప్పటి నుంచి పోలింగ్ ముగిసేంత వరకు కార్యకర్తలు ఎంతో శ్రమించి పని చేశారన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, వారికి పాసులు పొందడం, పోలీస్ వెరిఫికేషన్ తదితర ప్రక్రియ అంతా డివిజన్ల ఇన్‌చార్జీలు, అధ్యక్షులు పూర్తి చేయాలని సూచించారు. సోమవారం జరిగిన పోలింగ్ ఓటింగ్ సరళి, విజయావకాశాలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతా నాయక్, నాయకులు చలకాని వెంకట్‌యాదవ్, తులసి శ్రీనివాస్, వజీర్ ప్రకాష్‌గౌడ్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మకుటం సదాశివుడు, కట్ల నర్సింహయాదవ్, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవి, బుడ్డ సత్యనారాయణ, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.